# ఏప్రిల్ నాలుగు..



## వి.వి.ఎల్. సావిత్రి

భుజంగం ఆలోచిస్తున్నాడు. 'ఎలాగైనా ఈ ప్రమాదం నుండి బయట పడాలి. కానీ ఎలా? 'పొద్దున్న లేచినది మొదలు సవాలక్ష ఆలోచనలు.

'బుద్ధిపొరపాటయి ఆ పని చేశాను. డామిట్ ఛీ నాకు బుద్ధిలేదు.' తనలో తనే తిట్టేసుకుంటూ చేసుకుంటున్న షేవింగ్‌ని ఆపు చేసి నెత్తిమీద గట్టిగా కొట్టుకున్నాడు. మళ్ళీ అంతలోనే కోపంగా తన ముఖాన్ని అద్దంలో చూసుకున్నాడు. వర వరా గెడ్డం గీసుకోసాగాడు. భుజంగం కోపానికి సూచనగా గెడ్డం తెగింది. 'అమ్మో! 'అని మూలిగి మళ్ళీ తమాయించుకున్నాడు! తన పిచ్చి చేష్టలని ఎవరైనా గమనిస్తున్నారేమో నని అటూ ఇటూ చూసాడు.

' మనుషుల పొరపాట్లు చేయకుండా ఏదైనా మిషన్ ఉంటే బావుణ్ణు. అసలు ఏప్రిల్ నాలుగో తేదీ అనేది కాలెండర్‌లో లేకపోతే ఎంతబావుణ్ణు?' అనుకున్నాడు మనసులో. ఇలా ఆలోచనలతో బుర్ర హీటెక్కిపోతున్న భుజంగం నోరు మరింత హీటెక్కడానికా అన్నట్లు భార్య సీత కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమైంది.

'గుర్తుందా? ఏప్రిల్ నెలంతా మీకు వాయింపులే.. అంతేలెండి కష్టాలు మనుషులకు కాకపోతే మానులకు వస్తాయా 'కాఫీ గ్లాసు అందిస్తూ కొంటెగా నవ్వింది సీత.

' నాఆఫీసు భాగోతం దీనికెలా తెలిసిందబ్బా? 'ఆ ఆలోచనతో బుర్ర వేడెక్కి పోయింది. ఛర్రున లేచాడు.

'నోర్మూయ్! అతివాగుడు వాగుతున్నావ్. ఆడది వంటిల్లు దాటితే ఇలాగే ఉంటుంది. డొక్క చింపేస్తాన్... పిచ్చి వాగుడూ నువ్వూను... నాకు సవాలక్ష టెన్షన్లుంటాయి. నీకెందుకు? నెల తిరిగే సరికి కావలసిన వన్నీ అమరుస్తున్నాను. నోర్మూసుకుని నీవని నువు చూసుకో 'రొప్పుతూ అన్నాడు భుజంగం.

'అయ్యో రామ! నేనేం అన్నానండీ! ఏప్రిల్ నాలుగున మీ మరదలి పెళ్ళి. ఏదో ఒకటి ఇవ్వాలి. 15న మీ అన్నయ్య కొడుకు పెళ్ళి. 22న మీ బాబాయ్ గారి అబ్బాయి పెళ్ళి. ఇలా నెలంతా పెళ్ళిళ్ళే... మీకిక ఖర్చులే ఖర్చులు . అదీ గాక లోన్ మీద తీసుకున్నస్కూటర్‌కి డబ్బు కూడా కట్టాలి. అన్నీ ఇబ్బందులే అన్న ఉద్దేశంతో నేనంటే అలా తిడతారేమిటండీ! 'అయోమయంగా చూసింది సీత.

ఒక్క నిమిషం రిలీఫ్ ఫీలయ్యాడు భుజంగం.' ఛా అనవసరంగా తిట్టాను. పాపం పిచ్చిమొహాన్ని.'. అని తమాయించుకుని భార్యకి సర్ది చెప్పి పంపించాడు. పిచ్చాణ్ణి చూసినట్లు చూసి అక్కడనుండి లేచి వెళిపోయింది సీత.

'ఏమిటో వెధవ బ్రెయిన్.. అతిగా ఆలోచిస్తోంది. దీని దుంపతెగ. బ్రెయిన్‌ని తీసి ఓవరాయిలింగ్ చేసి బిగిస్తే బాగుణ్ణు 'అని సణుక్కున్నాడు. షేవింగ్ పని పూర్తి చేసుకుని మళ్ళీ ఆఫీసు కాయితాలు ముందేసుకు కూర్చున్నాడు.

'ఛత్! ఎంతలా ఎడ్జస్ట్ చేసినా ఆ 15 వేలు టాలీ అయి చావడం లేదు. పోనీ చేతిది పెట్టేద్దామా అంటే అంత డబ్బే ఉంటే ఈ గడ్డితినే పని చేసి ఉండే వాణ్ణేకాదు 'ప్చ్...ఆలోచిస్తున్నాడు. కూడుతున్నాడు. తీసేస్తున్నాడు. కళ్ళజోడు పెడుతున్నాడు...తీసేస్తున్నాడు. ఇంతలో బాబిగాడు, దీపిక పరిగెత్తుకొచ్చారు గదిలోకి.

' డాడీ! నెత్తిమీద గోరింక. చెప్పకు చెప్పకు చిట్టి పాప చెబితే నీకళ్ళుపోతాయి 'అని పెద్ద గొంతుతో అరుస్తూ పాటపాడుతున్నాడు బాబి. వాడతో పాటు దీపిక చేరి భుజంగం చుట్టూ తిరుగుతూ గోల గోల చేయసాగారు.

'హుష్ ! పొండవతలకి.. బయట ఆడుకు తగలడండి... నాప్రాణానికి ఆదివారం ఒకటి. మీరు కాల్చుకు తినడానికి'.... కొర కొరా చూసాడు వాళ్ళ వేపు. పిల్లలిద్దరూ ఒక్కక్షణం బిత్తర పోయినా భుజంగం కసరడాన్ని చాలా లైట్‌గా తీసుకున్నారు. దాంతో మళ్ళీ గోల కంటిన్యూ చెయ్యబోయారు.

' షటప్! రాస్కెల్స్.... ప్రశాంతంగా ఉండనివ్వరు.. పొండి...బయటకు పొండి 'మళ్ళీ అరిచాడు భుజంగం.

'ఏంటో డాడీకి మెంటలెక్కిందేమోనే దీపు... ఎలా అరుస్తున్నాడో చూడు 'అని వ్యాఖ్యానించి బయటకు తుర్రుమన్నాడు బాబి. వాడికి వంత పాడుతూ దీపిక కూడా బయటకు వెళ్ళిపోయింది. వంటగది గుమ్మంలో కూరలు తరుగుతున్న సీతకి భుజంగం వాలకం అస్సలు అర్ధం కాలేదు. లేచి ధబేల్‌మని తలుపులు మూసి కూర్చుని లెక్కలు కట్టడం మొదలు పెట్టాడు. ఏమిటబ్బా అంత సీక్రెట్..తలుపులు మూసుకుని మరీ ఏం చేస్తున్నారో అని సందేహించిన సీత వచ్చి చూడడానికి ధైర్యం చేయలేకపోయింది. పొద్దున్న లేచింది మొదలు చిర్రు బుర్రులాడుతున్న భుజంగాన్ని చూస్తే సీతకి కొంచెం భయమేసింది.

'భోజనం వడ్డించాను రండి! 'అని తలుపు తోసుకుని వచ్చింది సీత. ఏవో లెక్కలు వేస్తున్న భుజంగం ఆ శబ్దానికి ఒక్కసారిగా అదిరాడు. గబా గబా చేతిలో పేపర్లు బీరువాలో పెట్టి తాళం వేసి ఆ తాళాన్ని పాంటు జేబులో పెట్టుకుని భోజనానికి బయలు దేరాడు భుజంగం. అంత రహస్యంగా కాగితాలు దాచుకుంటున్నారేంటబ్బా? అని ఒక క్షణం ఆసక్తిగా చూసిన సీత ఏం అడిగితే ఏం గొడవ వస్తుందో అని బయటకు వెళ్ళిపోయింది.

సాయంత్రం నాలుగయింది. ఎండ తగ్గి అపుడే

చల్లటి గాలి వీస్తోంది. వసారాలో పడక కుర్చీలో నడుం వాల్చి ఆలోచనలతో వేడెక్కిపోయిన తల మీద చేతులు పెట్టుకుని రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు భుజంగం. సీత వంటింట్లో కాఫీ పెడుతోంది.

' అంకుల్... అంకుల్... 'అంటూ పక్కింటి బుజ్జిగాడు పరిగెట్టుకు వచ్చాడు. ఏమిటన్నట్టు చూసాడు భుజంగం.

' మా డాడీ మిమ్మల్నొక విషయం కనుక్కురమ్మన్నారు. '

ఏంటది? అన్నట్లు కళ్ళెగరేసాడు భుజంగం.

' మీ విషయమే..'. నసిగాడు బుజ్జి. అదే ఏమిటి? సరిగ్గా చెప్పు గద్దించాడు భుజంగం.


' అదేనంకుల్ ఏప్రిల్ 4న' చెప్పబోయాడు బుజ్జి. అప్పటికే భుజంగం పళ్ళు పట పటా కొరుకుతున్నాడు.

'ఏంట్రా? ఏంటీ? ప్రతీవాడికి లోకువైపోయాను' కుర్చీలోంచి చివాలున లేచాడు భుజంగం.అదిరిపడిన బుజ్జి పెద్దగా ఏడుస్తూ అక్కడినుండి పరుగు తీసాడు. కాసేపటికి పక్కింటి గుర్నాథం వచ్చాడు.

'ఏంటండి? ఏప్రిల్ 4న పేరెంట్స్‌డే కదా! మీరు స్కూలుకి వస్తున్నారో లేదో కనుక్కురమ్మని నేనే పంపాను. పసి పిల్లలపై ఎందుకండి కోపాలు చూపించడం? అయినా వాడేం చేసాడని. వాడిని అలా కసిరారు 'అని కొంచెం గట్టిగానే ప్రశ్నించాడు గుర్నాథం. భుజంగానికి మతి పోయింది. ఇంత చిన్న విషయం అడగడానికి వచ్చిన వాడిపై అలా ఎందుకు కసురుకున్నాడో తనకే అర్థం కాలేదు.

'మీవాడు విషయం చెప్పకుండా నసిగాడు . దాంతో కొంచెం గట్టిగా అడిగాను తప్ప నేనేం అనలేదే 'అని సర్ది చెప్పి పంపాడు . లాభంలేదు. పసిపిల్లవాడి ముందు సైతం బయటపడిపోయాను.ఛీ... ఆ వెధవ గడ్డితిన్న పని నా మెదడును తొలిచేస్తోంది. నాకు పిచ్చిగానీ ఎక్కలేదు కదా? తనని తనే గిల్లి చూసుకున్నాడు భుజంగం.అపుడే బయటకు వచ్చిన సీత భుజంగం అలా ఒంటిని గిచ్చుకోవడం చూసి భయపడింది. కానీ ప్రశ్నించలేకపోంది. అయోమయంగా భుజంగంవాలకం చూసి గ్లాసు చేతికందించి వెళిపోయింది.

'ప్చ్ ఎందుకు చేసానా కక్కుర్తిపని..' అప్పటికి పొద్దుటనుండి నూట తొంభైయవ సారి అలా సణుక్కోవడం. చెయ్యక చెయ్యక నేను చేసిన కక్కుర్తి పని మేనేజ్ మెంట్ దాకా వెళ్ళిపోయింది. ఎంక్వైరీ కమిటీ వేశారు. ఇప్పటి దాకా ఇంట్లో తెలీకుండా మేనేజ్ చేశాను. ఇకపై ఎలా? పోనీ అంత మొత్తాన్ని ఎక్కడైనా అప్పుగా తెచ్చి కలిపేసి ఎక్కౌంట్ టాలీ చేసేద్దామన్నా అంత మొత్తం ఈ మహానగరంలో అప్పుఇచ్చే వారేలేరు. పోనీ దొంగ లెక్కలు చూపించి సర్దేద్దామన్నా పొద్దుణ్ణించి కాయితాలు అయిపోతున్నాయి తప్ప ఫలితం లేదు. పోనీ ఓ పని చేస్తే? 'భుజంగం మదిలో తళుక్కున మెరిసిందో ఆలోచన. జెఎంఎం కేసులో అప్రూవర్‌గా మారిన మహతోలా ముందే.మేనేజ్‌మెంట్‌కు విషయం వివరిస్తే ...ఆ ఆలోచనతో మనసు ఒక నిమిషం కుదుట పడినా మళ్ళీ అంతలోనే భయం కమ్ముకుంది.ఇవాళ నా అంతట నేను ఒప్పుకున్నందుకు రేపటినుండి ఏ చిన్న తేడా వచ్చినా అంతా తనమీద రుద్దితే! అమ్మో ఊహక్కూడా తట్టుకోలేక పోయాడు భుజంగం.



-----

చల్లగాలి కోసం మేడ పైకి ఎక్కాడు. పిట్టగోడ మీద కూర్చుని ఆలోచిస్తున్నాడు. అదే సమయానికి పక్కమేడ ఎక్కిన మూర్తి 'ఏం సార్? ఏంటి మీ ఆఫీసు విశేషాలు?' అన్నాడు. భుజంగానికి ఛర్రున కోపం వచ్చింది. కానీ తమాయించుకున్నాడు.తను బయట పడకూడదు... అనుకుంటూ

' ఏం ఉంటాయ్? అన్నీ మామూలేగా 'అని ముక్త సరిగా సమాధాన మిచ్చి కిందకి దిగిపోయాడు.

-----

' ఏమండీ! ' పిలిచింది సీత.

'ఏమిటి? '... తిరగకుండానే ప్రశ్నించాడు భుజంగం.

'మీ ముద్దుల మరదలి పెళ్ళి మరో పదిహేను రోజులు మాత్రమే ఉంది.నన్ను పదిరోజులు ముందుగా రమ్మని ఉత్తరం రాసారు అమ్మా, నాన్నా.మీరు రాకపోయినా కనీసం నన్నైనా ముందుగా పంపితే.'.. నసిగింది సీత.

'డబ్బులు చెట్లకి కాయడం లేదు. నన్ను అన్నిసార్లు విసిగించకు. పైగా ఎండలో పిల్ల వెధవలతో తిప్పట. నువ్వు వెళ్ళకపోతే మీ చెల్లెలి పెళ్ళి ఏం ఆగిపోదులే'.... అటుతిరిగి పడుకున్నాడు. ఉసూరని నిట్టూర్చి ఇటు తిరిగి పడుకుంది సీత.

-----

'టెలిగ్రాం' అన్న కేకతో బయటకు వచ్చింది సీత.

'ఎక్కడనుండి బాబూ?' ఆదుర్దాగా ప్రశ్నించింది.

'నిజామాబాద్ నుండి. 'అన్నాడు టెలిగ్రాం తెచ్చిన వాడు. సంతకం చేసి తీసుకుంది. అందులో విషయమేమీ అర్థం కాలేదు సీతకి. సెగలు కక్కే ఎండలోంచి ఇల్లు చేరుకున్న భుజంగం కాళ్ళు కడుక్కుని మంచినీళ్ళు తాగుతుండగా టెలిగ్రాం సంగతి చెప్పింది సీత. పొలమారిపోయింది భుజంగానికి. ఎక్కడనుండి అని ప్రశ్నిస్తుండగానే చేతిలో పెట్టింది సీత. ఆ టెలిగ్రాం చదవగానే మతిపోయింది. అసలది ఎవరిచ్చారో, ఎందుకిచ్చారో తెలీటం లేదు.

' బి రెడీ టు మీట్ మి ఆన్ ఫోర్త్ ఏప్రిల్ '- ఫ్రం కృష్ణ ప్రసాద్, ఎస్ పి నిజామాబాద్. భుజంగానికి పై ప్రాణాలు పైనే పోయాయి. కొంపతీసి విషయం పోలీసుల దాకా వెళ్ళలేదు కదా! ఒకవేళ అదే అయితే ఊళ్ళో ఉన్న పోలీసులు రావాలి గానీ నిజామాబాద్ నుండి ఎందుకు వస్తారు ? అని తెలివిగా ఆలోచించి తాత్కాలికంగా ఉపశమనం పొందాడు భుజంగం. కానీ తెలీని పోలీసులు ఇంటిమీదకి ఎందుకు వస్తారు.. ఎంత ఆలోచించినా మనసు స్థిమితంగా ఉండడం లేదు. ఇదంతా ఆ కమిటీ వ్యవహారంలాగే ఉంది. అమ్మో! సీతకి ఇవన్నీ తెలిస్తే నానా అల్లరి అయిపోతుంది.వీళ్ళని ముందే ఊరు పంపేయాలి అని బలంగా నిశ్చయించుకున్నాడు. ఆ రాత్రే భార్యని ఊరు వెళ్ళమని చెప్పాడు.

'ముద్దుల మరదలి పెళ్ళి కదా! నువ్వు పిల్లలు ముందెళ్ళిపోండి. పెళ్ళిరోజుకి నేను అక్కడికి వస్తాను. రేపే మిమ్మల్ని బస్సెక్కిస్తాను 'అని చెప్పి నిద్రకి ఉపక్రమించాడు భుజంగం. సీతకి భుజంగం వాలకం అస్సలు అర్థం కావడం లేదు. నిన్నటికి నిన్న వెళ్ళడానికి వీలులేదన్న మనిషి హఠాత్తుగా మళ్ళీ వెళ్ళ మంటున్నాడు. ఏమిటో? అనుకుంది సీత.

మరుసటి రోజు భార్య, పిల్లల్ని బస్సెక్కించాడు. కాస్త స్థిమిత పడ్డాడు. ఇపుడు ఏం గొడవలొచ్చినా తను ఒక్కడే పడచ్చు మనసులోనే తేలికగా రిలీఫ్ ఫీలయ్యాడు . వారం రోజులు తీవ్ర టెన్షన్ పడ్డాక అసలు రోజు రానే వచ్చింది. ఈ వారం రోజులూ డబ్బుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు భుజంగం. ఏప్రిల్ 4... అతిభయంకరమైన రోజు. ఆఫీసులో తన ఉద్యోగం ఉండేదీ, ఊడేదీ తేలేరోజు. టెన్షన్‌తో చచ్చిపోతున్నాడు భుజంగం. తాను ప్రభుత్వ సొమ్ము అక్రమంగా వాడుకున్నందుకు గానూ ఎంక్వైరీ కమిటీ వేసింది మేనేజ్‌మెంట్. ఆకమిటీ తీర్పు ఎలా వస్తుందో తేలేది ఆరోజే. పొద్దున్నే లేచాడు. యధా ప్రకారం సాన్న పానాదులు కావించాడు. దేవుడి దగ్గర రోజూ కన్నా ఎక్కువసేపు నిలబడ్డాడు.

'ఈ గండం నుండి గట్టెక్కించు భగవాన్. పిల్లలు కలవాణ్ణి. మళ్ళీ జన్మలో గడ్డి తినను' అని మ

నసులోనే వేదుకున్నాడు. భయం భయంగా ఆఫీసుకు చేరుకున్నాడు. మేనేజ్ మెంట్ , ఎంక్వైరీ కమిటీ ఒకే ఛాంబర్‌లో ఉన్నాయి. ఆఫీసులో ఇలా తోకలు జాడించిన వాళ్ళందరికి పొద్దుటనుండి లోపల క్లాసులు అవుతున్నాయి.

భుజంగం వంతు వచ్చింది. మేనేజ్‌మెంట్ మంచితనమో భుజంగం అదృష్టమో కానీ కఠినమైన వార్నింగ్ ఇచ్చింది మేనేజ్‌మెంట్. వాడుకున్న సొమ్మును వెంటనే జమ చేయమని ఆదేశించింది. రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసింది. మరోసారి ఇటువంటి అక్రమాలకు పాల్పడితే వెంటనే సస్పెండ్ చేయమని పై అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. బుద్ధిగా మసలు కొమ్మంది. ఏసి రూం లోంచి బయటకు వచ్చిన భుజంగానికి మతిపోయింది. ఏం జరిగిందో కూడా గుర్తు రావడం లేదు. ఈ తంతు జరిగే సరికి సాయంత్రం నాలుగ్గంటలు దాటడంతో సైకిలు తీసుకుని ఇంటికి బయలు దేరాడు. మనసు ఆనందంతో గంతులు వేస్తోంది. విజిల్ వేసుకుంటూ సైకిల్ తీసుకుని ఇంటికి బయలు దేరాడు. దారిలో కిరాణా సరుకుల వాడిని ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. ఆ షాపు ఓనర్‌కి భుజంగం వాలకం ఆశ్చర్యాన్ని కలిగించింది. స్పీడుగా సైకిల్ మీద ఇంటికి చేరుకున్న భుజంగానికి ఇంటి ఎదురుగా ఓ నలుగురు మనుషులు గుంపుగా నిలబడటం ఆశ్చర్యాన్ని కలిగించింది. మళ్లీ ఏం ముంచుకొచ్చిందిరా బాబూ! అనుకుంటూ నీర్సంగా సైకిలు దిగాడు.

'మీ ఇంటికి పోలీసులు వచ్చారండి. మీతో ఏం పనులున్నాయో ఏమిటో'?అని భుజాలు ఎగరేసి వెళ్ళిపోయాడు పక్కింటి మూర్తి.

'భగవాన్ ఏమిటీ? పరీక్షలు. ఒకటి వదిలితే ఒకటి... ఆ గుంపు వైపు చూసుకుంటూ సైకిల్ లోనికి పోనిచ్చాడు. సైకిలు శబ్దం కాగానే ఇరుగు పొరుగు వారు వాళ్ళ వాళ్ల పోర్షన్లలోకి వెళిపోయారు.

'ఇంతకీ వచ్చిన వ్యక్తులేరీ? ' పోతున్న ప్రాణాలను కూడదీసుకుని పక్కింటి గుర్నాధం భార్యని అడిగాడు.

'ఇప్పటి వరకూ ఇక్కడే ఉండాలండీ? అన్నయ్యగారూ... ఎటువెళ్ళారో? మళ్ళీ వస్తారేమో లెండి. ఆ బుర్ర మీసాల పోలీసు గారికి ఇద్దరు అసిస్టెంట్లు కూడా ఉన్నారు. అబ్బ మనిషిని చూస్తేనే భయమేసింది భుజంగం అన్నయ్యగారూ..' అని సీన్లతో సహా వివరించింది పంకజం. భుజంగం ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

' కొంచెం మంచినీళ్ళు ఉంటే ఇవ్వమ్మా' అని అడిగాడు. వంటింట్లోంచి నీళ్ళు తీసుకొచ్చింది పంకజం. క్షణమైనా ఆలస్యం చేయకుండా వాటిని గబ గబా ఒక్క గుక్కలో తాగేసాడు.మనిషి రొప్పుతున్నాడు..

'కాసేపు కూర్చోండి అన్నయ్యా.. కంగారు పడకండి.' అని కుర్చీ చూపించి పనిలో పడింది పంకజం. కూర్చున్నాడన్న మాటే గానీ భుజంగానికి టెన్షన్ ఆగటం లేదు. పది నిమిషాలకొకసారి తమ ఇద్దరి పోర్షన్లకి మధ్యన ఉన్న తడిక చిల్లుల్లోంచి పోలీసులు వస్తున్నారేమో గమనిస్తున్నాడు.. కూర్చుంటున్నాడు.... మళ్ళీ లేస్తున్నాడు... ఆ దొంగచూపులు ఆ వాలకాన్ని ఓరకంట గమనిస్తూనే ఉంది గుర్నాధం భార్య పంకజం. కొద్దిసేపటికి వీధిలో పోలీస్ వ్యాన్ పెద్ద సైరన్ మోగిస్తూ వచ్చి గుమ్మంలో ఆగిఆంది. భుజంగం పై ప్రాణాలు పైనే పోయాయి. అలా తడికల్లోంచే తొంగి చూస్తున్నాడు తప్ప బయటకు రావడం లేదు. ఇంతలోనే ఒక పోలీసు వచ్చి తలుపు తట్టాడు. గుర్నాధం భార్య పంకజం బయటకు వచ్చింది.



'సార్ వచ్చారా? 'పక్కింటిని చూపిస్తూ అడిగాడా పోలీసు.

'ఆ వచ్చారు.... పిలుస్తాను' అని లోపలికి వచ్చింది.

'ఎందుకో కనుక్కోవాల్సింది చెల్లెమ్మా! ' అదుర్దాగా అన్నాడు భుజంగం.

'పోనీలే అన్నయ్యా! తప్పు చేసినపుడు లేని భయం ఇపుడెందుకు? ఏదనా ధైర్యంగా ఎదుర్కోనాలి. వెళ్ళి లొంగిపొండి భుజంగం అన్నయ్యా?' అంది పంకజం. అంత టెన్షన్‌లోనూ భుజంగానికి కోపం తారస్థాయికి అందుకుంది. అసలు నేను చేసిన నేరం ఏమిటో తెలీదు. ఎందుకు లొంగిపోవాలి? ఎవరికి లొంగిపోవాలి? ఇలా సణుక్కోవడంలో నాలిక కొరుక్కున్నాడు భుజంగం. ఏదైతే అదే అవుతుంది అనుకుని ధైర్యంగా గుండెలనిండా గాలి పీల్చుకుని బయటకు వచ్చాడు .

' మీరేనా భుజంగం అంటే?' అడిగాడు పోలీసు.

'ఆ అవును... నేనే ఏం? ఎందుకు? ఏం చేస్తావ్?, ఏం చేయగలవ్?' లేని ధైర్యాన్ని తెచ్చుకుని కొంచెం ధీమాగా నిలబడి టక టకా ప్రశ్నలు సంధించాడు భుజంగం.

'మా ఎస్‌పి గారు మిమ్మల్ని కలవాలంటున్నారు 'అని చెప్పుండగానే ఎస్‌పి జీప్ దగ్గరనుండి ఇంట్లోకి వచ్చాడు. భుజంగం నోరు తెరుచుకుని చూస్తున్నాడు పోలీసు డ్రస్‌లో ఉన్న ఆరడుగుల బలమైన విగ్రహాన్ని.

'ఏం ఎంతసేపటినుండి వెయిట్ చేయాలి నీకోసం?'కటువుగా ప్రశ్నించాడు ఆ ఎస్‌పి. అలా ప్రశ్నించగానే బెదిరిపోయాడు భుజంగం. నిండైన ఆ విగ్రహాన్ని చూడగానే భుజంగం పై ప్రాణాలు పైనే పోయాయి. పక్కింటి వారంతా గుమిగూడారు. ఒక నిమిషం తర్వాత

'అరే! చిట్టిగా... నేనురా .... కృష్ణని.....మనం చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం. ఇంకా గుర్తు పట్టలేదా నన్ను?' అని భుజం తట్టాడు ఆ ఎస్‌పి.ఆ దెబ్బతో ఈ లోకం లోకి వచ్చిన భుజంగం

'అరే కిష్టిగా నువ్వా? నేనసలు గుర్తు పట్టలేదు. పోలీస్‌డ్రస్ చూసి బెదిరిపోయాననుకో 'అన్నాడు.

'ఇంకా ఖంగారు, గాభరా పోలేదన్న మాట నీకు' అని నవ్వాడు చిన్న నాటి మిత్రుడు.' ఏప్రిల్ నాలుగు..... అమ్మో! నా దుంప తెంచేసింది. అబ్బబ్బ టెన్షన్‌తో చచ్చి పోయాను?మొత్తానికి నా డైరీలో గుర్తుండిపోయే రోజు. ఎంత టెన్షన్ పడ్డాను ఈ రోజున 'అనుకున్నాడు భుజంగం మనసులో. అప్పటి నుండి భుజంగానికి ఆగస్టు 15,జనవరి 26 తేదీలకన్నా ఏప్రిల్ నాలుగు ప్రాముఖ్యత మాత్రం మనసులో గుర్తుండిపోయింది.